మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

- ఆయన సేవలు చిరస్మరణీయం
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం: మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి తదితరులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు శుక్రవారం జిల్లాలోని వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంగెంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో నూతన ఆర్థిక సంస్కరణలకు పునాదులు వేసిన వ్యక్తిగా మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయమన్నారు. వరంగల్‌లోని వెంకటరమణ జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. గీసుగొండలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. నెక్కొండలో మన్మోహన్‌సింగ్‌కు టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఖానాపురం మండలం బుధరావుపేటలో, దుగ్గొండిలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. మన్మోహన్‌సింగ్ మరణంపై నర్సంపేటలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే, వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డు ప్రాంగణంలో సంతాప సభను ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి హాజరై మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. అంతేకాకుండా రాయపర్తిలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి నాయకులతో కలిసి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లబెల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- మాజీ సర్పంచ్‌ల డిమాండ్
- గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందించి నిరసన

గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌లు

నెక్కొండ, డిసెంబర్ 27: తాము గ్రామాల అభివృద్ధి కోసం ఎన్నో పనులు చేశామని, వాటి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తాజా మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పలు చోట్ల శుక్రవారం నిరసన తెలిపారు. ఈ మేరకు తాజా మాజీ సర్పంచ్‌లు నెక్కొండలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాదాసు రవి, ఆలకుంట సురేందర్, చంద్రమౌళి, స్వరూపా రవి, విజయా వెంకన్న, సుదర్శన్, మహ్మద్‌పాషా, శైలజా ప్రభాకర్, ఆంగోత్ భీమ్లా పాల్గొన్నారు. అలాగే, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ దుగ్గొండి మండలంలోని ముద్దునూరు గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పలు సమస్యలతో కుడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించే వరకూ ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రేవురి సురేందర్‌రెడ్డి, ఓడెటి తిరుపతిరెడ్డి, మోడెం విద్యాసాగర్, ఎం మహేందర్, ఏడెల్లి ఉమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

ఖిలావరంగల్, డిసెంబర్ 27: ముగ్గురు గంజాయి విక్రేతలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. శివనగర్ ఏసిరెడ్డినగర్‌కు చెందిన మజ్జిగ సాయి, పేర్న రాజశేఖర్, గొట్టిముక్కల తరుణ్ అదే ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్టు చేసి రూ. 2600 విలువైన 105 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

మాట్లాడుతున్న గడ్డం స్రవంతి

కరీమాబాద్, డిసెంబర్ 27: అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు కృషి చేస్తామని ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు గడ్డం స్రవంతి అన్నారు. 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అధ్యక్షతన శుక్రవారం ఉర్సు సీఆర్సీ భవన్‌లో ఇందిరమ్మ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిష్పక్షపాతంగా చేపట్టాలన్నారు. దరఖాస్తుదారుల ఇండ్లకు వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. కలిసికట్టుగా సర్వేను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్

గిర్మాజీపేట, డిసెంబర్ 27: జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధుల కోసం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి బీ రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత సమయానికి దివ్యాంగులు, వృద్ధులు హాజరు కావాలని డీడబ్ల్యూవో సూచించారు.

'అక్రమ కట్టడాలను తొలగించాలి'

నర్సంపేట, డిసెంబర్ 27: పట్టణంలోని 18వ డివిజన్‌లో అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు వెంటనే గుర్తించి తొలగించాలని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ కోరారు. శుక్రవారం ఆయన 18వ వార్డులో అక్రమ కట్టడాలను పరిశీలించారు. అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీలో నల్లాలను ఆక్రమించి చేపట్టిన కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్ బత్తిని రాజేందర్ ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సమ్మె చేపట్టిన పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు

ఖానాపురం, డిసెంబర్ 27: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఉస్మాన్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని, జీవో 51ని రద్దు చేయాలన్నారు. తమకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల టోకెన్ సమ్మె చేపట్టామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. సమ్మెలో బోడ వీరన్న, భిక్షపతి, విజయ్‌కుమార్, వెంకటమ్మ, శాంతమ్మ, మాణిక్యం, కుమారస్వామి పాల్గొన్నారు.

'మల్టీపర్పస్' విధానం రద్దు చేయాలి

నెక్కొండ: మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. రెండు రోజుల టోకెన్ సమ్మెలో భాగంగా నెక్కొండలో సిబ్బంది విధులు నిర్వర్తించిన అనంతరం సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఉద్యోగులు, సిబ్బందికి తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు భూక్యా నరేశ్, మండల ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి వీరస్వామి, ఈదునూరి సాయిలు, శివరాజు పాల్గొన్నారు.

ఖానాపురంలో సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

ఖిలావరంగల్, డిసెంబర్ 27: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి కాజీపేట–వరంగల్ రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కథనం ప్రకారం.. సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి కాజీపేట దర్గా రైల్వేగేటు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నీలం రంగు ప్యాంట్, తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడు. రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు.

అనారోగ్య కారణాలతో మరొకరు

గిర్మాజీపేట: అనారోగ్య కారణాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ షుకూర్ తెలిపారు. కాశీబుగ్గలోని పద్మానగర్ ప్రాంతానికి చెందిన నామని రాజేశ్(26) మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. అతడు కిరాణా షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. అనారోగ్యం వల్ల వివాహం కావడం లేదు. జీవితంపై విరక్తి చెందిన రాజేశ్ ఎవరూ లేని సమయంలో తమ గుడిసెలోని వాసానికి గురువారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాల్వ విషయంలో రైతుల మధ్య వాగ్వాదం

ఖానాపురం, డిసెంబర్ 27: బుధరావుపేట శివారు జాతీయ రహదారి పక్కనే సంగెం కాల్వకు ఏర్పాటు చేసిన పెద్ద మోరీ నిర్మాణం విషయంలో పైపారకం, కింది పారకంలోని రైతుల మధ్య శుక్రవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఇరిగేషన్ అధికారులను కలిసి సమస్యను పరిష్కరించుకోవాలని నచ్చజెప్పి పంపించారు.

ప్రమాదవశాత్తు కూలిన గోడ

ప్రాణాలతో బయటపడిన కుటుంబం

కూలిన ఇంట్లో ఉన్న దంపతులు

వర్ధన్నపేట, డిసెంబర్ 27: మండలకేంద్రంలో ఓ ఇంటి గోడ కూలిన ఘటనలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కొండేటి రజిత–రవి దంపతులు రేకుల షెడ్ నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలలో ఇంటి గోడ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆ సమయంలో దంపతులతోపాటు ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉన్నప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ కొండేటి అనితా సత్యం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నెక్కొండలో గంజాయి పట్టివేత?

నెక్కొండ, డిసెంబర్ 27: నెక్కొండ నుంచి ఆటోలో రవాణా అవుతున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్‌గా మారింది. ఇతర ప్రాంతాల నుంచి రైళ్ల ద్వారా నెక్కొండ రైల్వేస్టేషన్‌కు గంజాయిని తీసుకొచ్చి, ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తూ పలుసార్లు నిందితులు పట్టుబడ్డారు. నెక్కొండ మార్కెట్ యార్డు ప్రాంతంలో ఆటోలో గంజాయి రవాణా అవుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై నెక్కొండ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ యంత్రాంగాన్ని వివరణ కోరగా.. తాము గంజాయిని పట్టుకోలేదని పేర్కొన్నారు.

'మార్కెట్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

పోచమ్మమైదాన్, డిసెంబర్ 27: మార్కెట్ కమిటీ పెన్షనర్లు, ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ అమలు చేయాలని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగపురి సారయ్య కోరారు. దేశాయిపేట రోడ్డులో శుక్రవారం సుధీర్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర సహాధ్యక్షుడు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ఎంవీ నర్సింగరావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ట్రెజరీ అధికారి విజయసారథి, ఉపాధ్యక్షుడు రామ్ మనోహర్, మార్కెట్ కమిటీ అసోసియేషన్ నుంచి వెంకటేశ్వర్లు, అశోక్, జగన్, రాంకిషన్, దక్షిణమూర్తి, బియ్యబాని, సాంబరెడ్డి, వీరన్న, లక్ష్మీనారాయణ, సారంగపాణి, కొమురయ్య పాల్గొన్నారు.

గుడుంబా తయారీదారుల అరెస్ట్

నల్లబెల్లి, డిసెంబర్ 27: గుడుంబా తయారీదారులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో రేలకుంటకు చెందిన హలావత్ సమ్మయ్య ఇంట్లో తనిఖీలు చేయగా 20 లీటర్ల గుడుంబా లభించింది. దీంతో స్వాధీనం చేసుకున్నారు. అలాగే, రుద్రగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ కేక్యా వద్ద నాలుగు లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ప్రభాకర్ తెలిపారు. దాడుల్లో ట్రైనీ ఎస్సై కల్యాణ్‌కుమార్, సిబ్బంది విజయ్, వినయ్, రేవంత్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణచి వేయాలి

- తప్పుడు కేసులు నమోదు చేయొద్దు
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

నయీంనగర్, డిసెంబర్ 27: ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులతో పాటు రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణచివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అధికారులకు సూచించారు. శుక్రవారం కమిషనరేట్‌లో జరిగిన నెలవారీ నేర సమీక్షలో పోలీస్‌స్టేషన్, డివిజినల్, జోన్ల వారీగా పెండింగ్ కేసులు, నేరస్తుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కమిషనరేట్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి తగాదాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సమాచారంతో పాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకున్నారనే అంశాలపై సమీక్ష జరిపారు. నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించడంతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, నిజాయితీగా పని చేయాలని, సివిల్ పంచాయితీలకు దూరంగా ఉండాలని, తప్పుడు కేసులు నమో దు చేయొద్దని, పోలీసులు అప్రమత్తంగా లేకుంటే శాంతి భద్రతలు అదుపు తప్పుతాయని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. సమావేశంలో డీసీపీలు రాజమహేంద్రనాయక్, రవీందర్, ఏఎస్పీ మనన్ భట్, అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

అక్రమ కూల్చివేతలపై అఖిలపక్షం నేతల కన్నెర్ర

వర్ధన్నపేట, డిసెంబర్ 27: వర్ధన్నపేట మున్సిపల్ కేంద్రంలో రాత్రి వేళల్లో ఆకస్మికంగా మున్సిపల్ అధికారులు చేస్తున్న అక్రమ కూల్చివేతలపై శుక్రవారం అఖిలపక్షం నాయకులు కన్నెర్రజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ మండల నాయకులు పట్టణకేంద్రంలో మున్సిపల్ అధికారులు అక్రమంగా తొలగించిన డివైడర్‌ను పరిశీలించి నిరసన ర్యాలీ చేపట్టడంతోపాటు ఆందోళనలు నిర్వహించారు. అనంతరం అఖిలపక్షాల నాయకులు తూళ్ల కుమారస్వామి, అన్నమనేని అప్పారావు, తోటకూరి రాజమణి, మార్గం భిక్షపతి మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన రోడ్డు డివైడర్లను మున్సిపల్ అధికారులు ప్రైవేట్ వ్యక్తుల స్వార్థపూరిత ప్రయోజనాల కోసం తొలగిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్లను తొలగించేందుకు ఆదేశాలు, అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. కనీసం మున్సిపల్ కౌన్సిలర్లకు కూడా ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలను ప్రోత్సహిస్తున్న మున్సిపల్ కమిషనర్‌పై జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండేటి అనితా సత్యం, పెద్దూరి రాజ్‌కుమార్, కొండేటి శ్రీనివాస్, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, వసంత్‌నాయక్, అయిత ఎల్లయ్య, పిట్టల రాజు, మహ్మద్ రహీం పాల్గొన్నారు.

'పాపన్న విగ్రహానికి రాజకీయ రంగు పూయొద్దు'

మాట్లాడుతున్న తెలంగాణ గౌడ సంఘం నేతలు

రాయపర్తి, డిసెంబర్ 27: మండలంలోని మైలారం ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద దాత సహకారంతో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణకు రాజకీయ రంగు పులుముతూ అడ్డుపడడం సరికాదని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోలగాని యాదగిరిగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పాపన్న విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర, ఉమ్మడి వరంగల్, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. పాపన్న విగ్రహాన్ని తాము దాత సహకారంతో ఏర్పాటు చేసుకున్నామని స్పష్టం చేశారు. కావాలనే కొన్ని రాజకీయ పార్టీల నేతలు ఆవిష్కరణకు అడ్డుపడడం సరికాదని, బెదిరింపులు మానుకోవాలని కోరారు. లేకుంటే తెలంగాణ గౌడ సంఘం నేతలతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, దిష్టిబొమ్మల దహనాలు, రాస్తారోకోలకు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ గౌడ సంఘం ప్రతినిధులు పట్టాపురం ఏకాంతం గౌడ్, మండల ప్రతినిధులు రంగు కుమార్ గౌడ్, నాగపురి రాంబాబుగౌడ్, కోల కొమురయ్యగౌడ్, సంపత్‌గౌడ్, రాజు, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

చెన్నారావుపేట, డిసెంబర్ 27: ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలైన ఘటన మండలకేంద్రంలోని జాగృతి విద్యానికేతన్ పాఠశాల సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం ఏనుగల్‌కు చెందిన ఆటోలో ప్రయాణికులతో నెక్కొండ నుంచి నర్సంపేట వైపు వస్తున్నది. మండలకేంద్రంలోని జాగృతి స్కూల్ సమీపంలోకి చేరుకోగానే రోడ్డుపైకి వచ్చిన చిన్నారిని తప్పించబోయి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నితిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే నితిన్‌ను నర్సంపేటలోని ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

వధూవరులకు ఎర్రబెల్లి ఆశీర్వాదం

రాయపర్తి, డిసెంబర్ 27: మండలంలోని గట్టికల్‌లో బీఆర్ఎస్ యువజన నాయకుడు దాసరి శ్రీనివాస్ సోదరి శ్రీవిద్య–రాజేశ్ వివాహ రిసెప్షన్ శుక్రవారం జరిగింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా శివరామపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు నాగపురి సోమయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, ఆకుల సురేందర్‌రావు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, పూస మధు, చెవ్వు కాశీనాథం, చిన్నాల వనజ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, బాషబోయిన సుధాకర్, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, భూక్యా క్రాంతి, చెడుపాక కుమార్, ఎల్లస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చల్లా ధర్మారెడ్డి

మృతుడి కుటుంబానికి చల్లా పరామర్శ

సంగెం, డిసెంబర్ 27: మండలంలోని కాట్రపల్లికి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు చింతిరెడ్డి భరత్‌రెడ్డి తండ్రి మాధవరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి గ్రామానికి చేరుకొని మాధవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చల్లా వెంట పార్టీ జిల్లా, మండల నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, సారంగపాణి, సుదర్శన్‌రెడ్డి, దొనికల మల్లయ్య ఉన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న మేయర్ సుధారాణి

ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలి: మేయర్

వరంగల్, డిసెంబర్ 27: గ్రేటర్‌లో డివిజన్ల వారీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సమగ్ర సమాచారంతో పక్కాగా నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆమె క్షేత్రస్థాయిలో ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వేకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కాగా, గ్రేటర్‌లో 1,43,255 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, శుక్రవారం వరకు 50,934 దరఖాస్తుదారులపై సర్వే చేశారు. ఇంకా 92,321 దరఖాస్తులను సర్వే చేయాల్సి ఉంది.


వెంకటేశ్వర్‌రావును పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

బాధిత కుటుంబానికి బోయినపల్లి పరామర్శ

పర్వతగిరి, డిసెంబర్ 27: మండలంలోని ఏనుగల్లులో కారోబార్ వెంకటేశ్వర్‌రావు తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ శుక్రవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు బోయినపల్లి యుగేందర్‌రావు, దేవేందర్‌రావు, గుండారపు సతీశ్‌రావు, నల్లపు అశోక్, దుడ్డు మహేందర్ ఉన్నారు.

ఖోఖో టోర్నమెంట్ నిర్వహణకు రూ. 10 లక్షల విరాళం

గీసుగొండ, డిసెంబర్ 27: మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో జనవరి 8 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంట్‌లో మ్యాట్ కొనుగోలుకు తెలంగాణ ఆయిల్ సీడ్స్ చైర్మన్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి రూ. 10 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు శుక్రవారం పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో టోర్నమెంట్ నిర్వాహకులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఖోఖో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి తోట శ్యామ్ సుందర్, రమణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోట రాంబాబు పాల్గొన్నారు.

'మాజీ మంత్రి లక్ష్మమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి'

పోచమ్మమైదాన్, డిసెంబర్ 27: మాజీ మంత్రి, మాదిగ హక్కుల ఉక్కు మహిళ సదా లక్ష్మమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ట్యానరీ అండ్ లెదర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ చర్మకారుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ కొత్తూరి యాకేందర్ కోరారు. దేశాయిపేటలో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్ర మాజీ వేజ్‌బోర్డు చైర్మన్ జన్ను జకార్య అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. సదా లక్ష్మమ్మ తొలి మహిళా డిప్యూటీ స్పీకర్‌గా, దేవాదాయ సోషల్ వెల్ఫేర్ శాఖలన్నీ తొలి మహిళా మంత్రిగా సమర్థవంతంగా పని చేశారని గుర్తుచేశారు.

చికిత్స పొందుతూ ఐదుగురి మృతి

- పలు కారణాలతో దవాఖానల్లో చేరిక
- విషమించి మృత్యువాత
- జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు

నెక్కొండ/చెన్నారావుపేట/గీసుగొండ/ఖిలావరంగల్, డిసెంబర్ 27: చికిత్స పొందుతూ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు మృతి చెందారు. నెక్కొండ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. మండలంలోని బంజరుపల్లి శివారు ధర్మతండాకు చెందిన బదావత్ వీరన్నకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. వీరన్న మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 12న అతడి భార్య రక్మి భర్తను మందలించడంతో క్షణికావేశానికి గురైన వీరన్న అదే రోజు రాత్రి పొలం వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగి ఇంటికి వచ్చి భార్యతో చెప్పాడు. వెంటనే అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. రక్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే, చెన్నారావుపేట మండలం బోజెర్వుకు చెందిన మట్టిపల్లి యాదలక్ష్మి(45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు. ఆమెకు మూర్ఛ వ్యాధి ఉండడంతో మందులు వాడుతున్నది. చలికాలం, వర్షాకాలంలో వారానికి రెండు మూడుసార్లు మూర్ఛ వచ్చేది. కొద్ది రోజుల నుంచి మూర్ఛ ఎక్కువ కావడంతో ఈ నెల 19న ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న యాదలక్ష్మి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు మిరాల ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా గీసుగొండ మండలం వంచనగిరిలో భాషనపల్లి శ్రీనివాస్(48) చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ మహేందర్ తెలిపారు. శ్రీనివాస్‌కు 15 ఏళ్ల క్రితం నెక్కొండ మండలం దీక్షకుంటకు చెందిన మహిళతో వివాహమైంది. పిల్లలు కాకపోవడంతో ఏడు నెలల క్రితం విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 26న క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి సోదరి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. అలాగే, ఎలుకుర్తి గ్రామానికి చెందిన గొర్రె యాదగిరి(44) దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ చెప్పారు. యాదగిరి నవంబర్ 16న మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. తనకు మద్యానికి డబ్బులు ఇవ్వాలని వేధించాడు. అదే రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఎంజీఎంహెచ్‌కు తరలించారు. ఈ క్రమంలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. అలాగే, కరీమాబాద్ బీఆర్‌నగర్‌కు చెందిన తాపీమేస్త్రీ గోనెల సాంబరాజు(32) ఇటీవల గాయపడి ఎంజీఎంహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎలక్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565